ప్రేమ సూత్రం

పూడిపెద్ది వెంకటరమణయ్య గారు (కవితాసమితి)

"అబ్బ! తెరిపయింది? పోనీండి! అంతే చాలును! తెల్లవారిదాకా రావడం మానేశారు కా! అదే పదివేలు. మీ కెప్పటి కయినా యీనిర్భాగ్యురాలు జ్ఞాపకంవస్తే అదే మహామేరువు. స్త్రీముఖం కంటె శ్రీనివాసరావుముఖం ఖూ కందంగా కనబడుతుంది కాబోలు! స్నేహమైతే పగలల్లా కలుసుకుంటారు. చాలిందికాదూ? రాత్రి పన్రెండు గంటలదాకా మీరక్కడ బాతాకానీ చేస్తూవుంటే నేనొక్కర్తినీ యిలా కూర్చోనా? బాగా నేవుంది!"

ఆమాటలు విని సుందర్రావు జేబులో వాచీతీసి చూచేడు. పావుతక్కువ తొమ్మిదయింది. కమలం మొగం చూచేడు. ఆమె కళ్లలో నీటిజాడలు కనబడ్డాయి. సుందర్రావు తగ్గివున్న దీపంతో సరిగా చిన్నబోయాడు. కమలం అనురాగానికి మెచ్చుకొని కలకలలాడేడు. తన ముఖకళతో సరిగా దీపం హెచ్చించేడు. "కమలం!" ఇంకా తొమ్మిది కాలేదు. ఏమంత తొందర?

కమలం—"ఒక్కర్తెనూ ఉండలేకా. మరేముంది? నాకేలా తొందర? నే నందరిలాగూ తొందరపడీదానినయితే బాగానే ఉండును. నేనెంత చేసుకున్నానో అంతేగాని యెక్కువ రమ్మంటే యెలావస్తుంది? నా తొందర చూచి మీ రాశ్చర్యపడితే తప్పులేదు. "మనుసుకురాని మనువుకు నిలుచుచోటే నిద్ద"రట

సుందర్రావు:—"ఇప్పుడేమయింది చెప్పూ?"

కమలం:—"ఏమిటవుతుంది? ఏమీ కాదు!" ఎందుకలా బొమముడేసి చూస్తారు? నాదే తప్పా? వసంతుడితో విరహవేదన చెప్పుకుంటే కోకిలకంఠంతో కోప్పడ్డాడట. మన్మథుడు గదా అని పూలదండ కానుక పెడితే పుష్పబాణాలతో హృదయం పగులగొట్టడా? మీదా తప్పు? నాదీ! హృదయం దాచుకోలేకపోతే యిలా గేవుంటుంది. దామరపువ్వులాగు తెంపేసి మీపాదాలదగ్గర పడేశాను నా హృదయం! పరాకుచేతనైనా మట్టేస్తారు. మీ కేమిటి? మీరు మగరాజులు! ఆడుదాని అనురాగానికి కూడా తెరచాటుండాలి కదా?"

సుందర్రావు:— "ఊరికే నువ్విలా రొనరొనలాడితే యెలాగూ? రేపటినుండీ మరి పైకి రాత్రిళ్లు వెళ్లనులే. ఇవాళకు క్షమించేవా?"

కమలం—"అన్నిటికీ వెటకారమే! నే నా క్షమించేదాన్ని? మీ రేమంటే చెల్లదు? మీ యిష్టంవచ్చినట్టూ ఆడండి."

ఆయింట్లో సుందర్రావూ కమలంయిద్దరే వున్నారు. సుందర్రావు స్కూళ్ల ఇన్స్పెక్టరు గుమాస్తా. నలభైరూపాయీలు కాబోలు జీతం యిస్తారు. మరి భూములూ పుట్రలూ యేవీ

లేవు. సుందర్రావు మంచిజాగ్రతగా కాలక్షేపం చేసేవాడు. కమలంమాత్రం కొంచెం దర్జాఅయిన కుటుంబంలో పుట్టిందేమో వేషంలోనూ, భాషలోనూకూడా తన విశాలహృదయం చూపిస్తుంది. చీరల యెన్నికలో, నగల చేతల నాడెంలో, ముస్తాబులలో, మురిపెంపులలో అనుదినం యేదో ఒకవింత కనిపెడుతూనే వుంటుంది. కమలం గదిలో రెండు నిలువుటద్దాలున్నాయి. వండుతూన్న రెండు గడియలూ ఏందూరంగా వుంటుందో కాని తక్కిన కాలమంతా కమలం ఆనిలువుటద్దాల మధ్యనే నిగనిగలాడుతుంది. చెక్కులు తుడుచుకుంటూ, చెంపలు దిద్దుకుంటూ, ముంగురులు ముడుచుకుంటూ, పెదవులు సవరించుకుంటూ, కనురెప్పలల్లారుస్తూ, ఎగాదిగా తన నీడ అద్దాల్లో చూచుకుంటూ ఒక్కొక్కనాడు వేళకూడా మరిచిపోతుంది. కమలం సారెవచ్చి యేడేళ్లుయిందో, యెనిమిదేళ్లయిందో ఇవాళ సారె వచ్చినట్టుంది.

ఆరోజున మెల్లగా యిద్దరూ రాజీపడి వీధితలుపు గడియేసుకుని పడకగదిలో ప్రవేశించేరు. గదిలో ప్రవేశించగానే కమలం మొగాన్న చిరునవ్వు మొలకెత్తించింది. కన్నులరవాల్చింది. నీరులాటి చీర జిలుగుపైట భుజం మీదినుండి సగం జార్చింది. వక్షొన్ని దోబూచులాడించే వెలితిరవికెలోనుండి మిలమిలలాడే సన్నవాచీగొలుసు చేత్తోసవరిస్తూ కనురెప్పలు బరువుగా వాల్చి, అడుగుసంగోరు పెడుతూ అలా క్రీగంటను అద్దంలో చూచుకుంది. అలాగే సుందర్రావుముఖం చూచింది. ఇదంతా సుందర్రావు చూడనే లేదు. మంచంమీద దుప్పటీ దులిపి పరుస్తున్నాడు. పగలల్లా కచేరీలో కూర్చుని తలవంచికొని వ్రాసివ్రాసి వున్నాడేమో నడుం లాక్కొచ్చింది కాబోలు పాపం అతడలా ఆమంచంమీద సాగిలిపడ్డాడు. కమలం శృంగారచేష్టలు కనిపెట్టలేకపోయేడు. కమలం అలా నిలబడిపోయింది. చేతులు క్రేలవైచి తలవంచికొని వేడినిట్టూర్పు విడిచింది. అ లా గే సుం ద రా వు ను చూ చి రా? అలాగే తననీడ అద్దంలో చూచుకుంది. ఇంతలో సుందర్రావామెను చూసేడు "కమలం! యిలారా" అన్నాడు. కిటికీలోనుండి వస్తూన్న సన్నగాలిలో పెనగులాడుతూన్న ముంగురులను చేయి అంటీ అంటకుండా సవరించబోతూ, దీపపు వెలుగున మిలమిలలాడే వజ్రపుపొడి ఉంగరంనీడ వైపు అద్దంలో చూచి బరువుగా ఊపిరితీసి యెగసిన హృదయౌన్నత్యంమీద రెండోచేయివేసికొని అద్దంలో నీడ చూచుకుని అలాగే సుందర్రావువైపు చూచి చురచుర లొలికించేసింది. ఆచూపుతో సుందర్రావు వచ్చి, అల కలచిక్కు సవరిస్తాడేమో అనుకుంది. పొడిఉంగరపువ్రేలు ముద్దుపెట్టుకుంటాడేమో అనుకుంది. బరువు ఊపిరిలో పలవరిస్తాడేమో అనుకుంది. అల్లలలాడే హృదయౌన్నత్యానికి అభయహస్త మిస్తాడేమో అనుకుంది.. అద్దపు నీడతో అల్లుకొనిపోతాడేమో అనుకుంది. అతడలాచూస్తూ కూర్చున్నాడు. పైటమరింత జార్చేసింది. చీరకుచ్చెళ్లు

జలజలలాడించేసింది. నడుంగడగడలాడించేసింది గోడలనున్న పటాలన్నీ ఛాయాగ్రహణ యంత్రాలయి తన విలాసాలను ముద్రించుకోకూడదా అన్నట్టు గడల్లా కలయచూచింది. ఇదంతా చూచిచూచి సుందర్రావు దిగ్గునలేచి మంచం నడుమను కూర్చున్నాడు. "ఏమిటి? కమలం? నీ వెప్పుడూ విశాలంగా మాట్లాడవ్వూ! సినీమా బొమ్మలాగు క్షణానికొకలాగు కనబడతావు! సినీమాలో యిది ఫలానా అని ముందుగా కొంత వ్రాస్తారు. ప్రక్కనొకడు చెపుతూవుంటాడు. నిన్ను తెలుసుకోడానికి నాకలాటి సహాయాలేవీ లేవ్వూ? నా కెలా తెలుస్తుంది? చెప్పమరీ!" అన్నాడు.

"మీకన్నిటికీ వెటకారమే? నే నంత దాన్నా? సత్యభామనా? వరూథినినా? అలాగే అనండి. ఆడదానిహృదయం మీ కెలా తెలుస్తుంది? కానీయండి. నన్నిలా యెన్నాళ్లాడిస్తారో ఆడించండి మీ అక్కర తీరినతరువాత నేను వక్కపాటయినా చేస్తా నా? మీ జీవనవిధానం నాకూ తెలియకుండా ఉంది. అనుదినమూ అదే నడకా! మరి మార్పే లేదు. లెక్కలమేష్టరులాగు రెండుమెట్లలో తేల్చేస్తున్నారు. ముక్తసరిగా మూడుకార్యాలతో దినాలు గడిపేస్తున్నారు! భోజనం-కచేరీపని-నిద్ర - ఈ భాగ్యానికేనా నన్ను రంభలాగు నిత్యం కలకలలాడమంటున్నారు? యౌవనం ఒక్కటీ గాజుకాయలాగ మీకంటికి కనబడితే చాలు కాబోలు! మీ అక్కర తీరినతరువాత సగం త్రాగిన సోడాబుడ్డిలాగ ఆడుదాని శృంగారం అంతా అవతల పారపొయ్యవలసిందే? ఆడుదాని నవ్వు వెన్నెలలో మగవాడు శృంగార గీతాలు పాడాలి. ముంగురుతీగలమీద మురుగీతాలు మ్రోగించాలి. చూపుతీగలతో పూవుటీరాలు గట్టాలి. చెక్కుటద్దాలలో చిత్రలేఖనలు చూడాలి. పైటచెరగులో ప్రబంధాలు చదవాలి."

"అదేమిటో! అవన్నీ నా కర్థం కావు. కమలం."

ఆమాట విని కమలం ఉలికింది. తన ఉన్నతవక్షం క్రిందికి యెడమచేతి ముంజేయి వంచి దానిమొన కుడిమోచేతి నాని ఆ చేతి వ్రేలికొనను ముఖంనిలిపిసుందర్రావును ఫుల్కుఫుల్కున చూచి జలజలా కన్నీటిబొట్లు జాలువారించేసింది. క్రిందిపెదవిని మునుపంటిక్రిందికి బిగించి తేలుడుగన్నులతో తీక్ష్ణంగాచూచి తల పంకించింది. చీరకుచ్చెళ్లు నలగకుండా, చెంపకురులు చెదరకుండ పైటచెరగు తొట్రుపడకుండా మెల్లగా ఆ నిలచినచోటనే నేల కొరిగింది. చాచిన చేతిదండమీద తల నానుకొని పడుక్కుంది. పైటచెరగుతో సంగోరుముసుగు వేసికొంది. వెక్కివెక్కి యేడవడం మొదలుపెట్టింది. ఆనిట్టూర్పులలోనే ఆ వెక్కులలోనే "కలకంఠవధూకల కాకలీధ్వను"లు గలగలలాడించేస్తూంది.

"ఏమిటి కమలం! ఊరికేకూర్చో యేడుస్తాంవేం? నేను నీకేం తక్కువ చేసేను? నేనెంత నిర్భాగ్యుడనైనా, నా జీతం యెంత తక్కువయినా, అందులోనే సర్దుకొని నీకోరిన చీర, నీవు చెప్పిన రవిక, నీవు చేయింపు మన్న

నగ చేయించేను. నీముద్దు కేంలోపం చేశాను? నీవలంకరించుకుంటే నాకుమాత్రం సంతోషం కాదూ? నీశృంగారం నా ఆనందానికే అని నాకు తెలియదూ? అయితే నాకొక్కొక్కప్పుడు నీ లీలలు అర్థంకావు. అయినప్పుడల్లా ఆనందిస్తూనే వుంటాను. నీశృంగారచేష్టలు గబగబా వర్ణించడానికి కవిని కాను. విశాలంగా పాడడానికి గాయకుడను కాను. పదేపదే పొగడడానికి పండితుడను కాను. అదికాక నీవే చూస్తున్నావు. పగలల్లా పనిచేస్తేనే కాని మాకచేరీలో పని తెమలదు. పని యెక్కువ గుమాస్తాలు తక్కువ. ఎలాగో సాయంతనం అయి యింటికి వచ్చేసరికి అలసిఉంటానేమో నిద్రకోసం తహతహలాడుతుంది శరీరం. నీచెప్పిన వలపుపందెర లెప్పుడు వేయడం? నాకు కలలోకూడా ఇన్స్పెక్టరు కోపపడుతూన్నట్టే వినబడుతుంది. అదికాక కమలం ఆరేళ్లయిందో, ఏడేళ్లయిందో నీకింకా యీసరదాలేమిటి? షోకులు లేకపోతేనేమీ మన సుఖానికి లోటులేదు కదా! నీవు రోజురోజుకీ ఒరదీసిన కత్తిలా గిలా మిలమిలా మెరిసిపడుతూవుంటే, నేనెంత పాషాణాన్నయినా భయపడనూ?" అన్నాడుసుందర్రావు.

కమలం లేచి కూర్చుని కన్నీళ్లు తుడుచుకుంటూ "అయితే మును పలాయెందుకన్నారు? మనమధ్య పిల్లలుంటే శృంగారభాగ్యం జుర్రుకోడాని కవకాశం ఉండదన్నారు. దానిని గురించి కావ్యాలు చదివేరు. నేనెప్పుడూ అనుకోని ప్రేమ నాకు నాయౌవనంమీదకల్పించేరు. నా యౌవనంతోటే మీ జీవనసుఖ ముందన్నారు. ఆయౌవనం పిల్లలవల్ల తగ్గిపోకుండా మందులిస్తున్నారు. పిల్లలుపుట్టకుండా యంత్రం తెప్పించేరు. నేనదంతా నిజమనుకొన్నాను. మీచెప్పిన కబురులు విని మీకోసమే దినదిన ప్రవర్ధమానంగా యౌవన శృంగారం పెంచుకుంటూఉంటే నాయీప్రయాసాన్ని షోకులనీ సరదాలనీ వెక్కిరిస్తారా? మీకు నిజంగా నా శృంగారం కావాలనుకున్నాను. ఇవన్నీ వట్టి మాటలేనా? ఆగ్రంథకారులేదో వ్రాస్తే మీరు కూడా అదే అని నన్నీ పర్వతశిఖరంమెక్కించి యిప్పుడు క్రిందికిత్రోసివేస్తారా? నేను ప్రేమించిన వ్యక్తికి పనికిరాకపోయినతరువాత నాకీ శృంగారం యెందుకూ? ఆహా! అడవిమల్లెపువ్వునయినానే! స్వానుభవాసక్తిచేత తుమ్మెద వాల్తే వాల్తుంది. ఈపరిమళ మేలాదానికి? దానికడుపునిండినతరువాత నన్ను ముంగాళ్లను తంతే తంతుంది. దానిదా తప్పు? ఓఅడవిమల్లెపువ్వా, నాకంటె నీవే మిక్కిలి అదృష్టవంతురాలవు. నీజీవితకాలపరిమితి తక్కువవడంచేత నీదుఃఖంకూడా తక్కువే! నేనీ నిలువుపాటున వాడిపోయి నేలరాలిపోతే యెంత బాగుండును! నేనపురూపంగా వన్నెలిడికొంటూ చిత్రించికుంటూన్న యీ నా శృంగార పటంమీద నా నాయకుడే నిరసించి ఉమ్మివేసినాడు." అని లేచి నిలబడి కమలం తననీడ అద్దంలో చూచుకుంటూ "కన్నులకు దిద్దికొన్న యివి కాటుక కొలుకులుగావు పూలములుకు లనుకున్నాను. నాకన్నీటిలో విన్నబాటున పాపమా కొలుకులెల చెదరిపోయినావో! పాలమీగడ లాటి

చెర్కులతలకు చాటుచాటుకుపోయి యెలా సన్నగిలి పోతూందో! ముడిచికొన్న లలాటాన్ని నటించడాని కిష్టంలేక వెనకకు పోవడానికి కాబోలు ముంగురులు తొట్రుపడి ఒకదానితో ఒకటి యెలా పెనగులాడుతున్నాయో! పైకి బాహాటంగా రావడానికి సంకోచించి నాఊర్పులుసైతం గద్గదికతో కాలక్షేపం చేస్తున్నాయి. చేయవూ? నైరస్యమెవరితె భరిస్తుంది? నేనిక నిలబడలేను! ఏంపతనం! ఎంతగర్వభంగం! నేనిలాకావడాని కేంతప్పు చేశాను. నేనీవంత యెలాభరించేది? భరించలేను! భరించలేను!!" అంది.

౨

"ఏమయ్యా! రాత్రిల్లా యేంచేస్తున్నావు? కళ్లలా యెఱ్ఱగా ఉన్నాయేం? అందుకేనా యేమిటి? నీకివాళ ప్రొద్దెక్కి తెల్లవారింది? ఎనిమిదయిందిగదా, యిప్పుడా కచేరీకి రావడం? టపా యెప్పుడు పంపుతావు? మాట్లాడవేం? నీకాండక్టేమీ బాగులేదు! ఎందుకాలస్యంగా వచ్చేవో సంజాయిషీ యిచ్చుకో" అన్నారు ఇన్స్పెక్టరుగారు. పాపం సుందర్రావు రాత్రల్లా ఆనాటకం ఆడి ఆకన్నీళ్లు తుడిచి అలసిపోయేడేమో తెల్లవారి లేవలేకపోయేడు. ఎలాగో మొండికెత్తి లేచి వెళ్లేసరికి రోజూకంటె ఆలస్యం అయింది. ఇన్స్పెక్టరలాకోపం పడుతూనే ఉన్నాడు సుందరరావు జవాబు చెప్పకుండా కచేరీ గదిలోకివెళ్లి పోష్టుకు పంపించవలసిన టపాలుసిద్ధంచేసి తనసొంతఉత్తరాలొకటో రెండో కలిపి బంట్రోతు చేతికిచ్చివేసి కుర్చీలో అలా చేరబడి కూర్చున్నాడు. రాత్రి కథంతా ఆలోచించుకున్నాడు. ఏమిటిచేయడం? ఎవరితో చెప్పకోవడం? మాట్లాడితే కమలం శృంగారం అంటుంది. విలాసం అంటుంది. ఒయ్యారమంటుంది. ఒద్దికలంటుంది. సరే యివన్నీ ఆడుదానిలో తగుమాత్రం ఉంటే ఆనందమేగాని, ఇలా విపరీతమయితే యెలాగ? పుంజెడు మెతుకులకోసం ప్రొద్దల్లా పాటుపడే నాలాటివాడికి శృంగారాదులు చూచి మెచ్చుకోవడానికి సమయమెక్కడ చిక్కుతుంది? కమలం అస్తమానం రంభానలకూబరులలాగు రాత్రింబవళ్లు విహరిద్దామంటుంది. నేనిలా విహరిస్తూ కూర్చుంటే నాయీవిహారం యెవరు చూస్తారు? కానీ నేనిలా కమలాన్ని యేడిపించలేను. సరేమా అమ్మ వస్తుందిగదా! ఆమెపెద్దది. ఏదైనా ఉపాయం చెపుతుంది." అనుకొని లేచి భోజనానికని యింటికివెళ్లేడు.

3

"నాయనా సుందరం! ఏమిటీ కమలం వేషం? ఆమెగదువ్వేడేమిటి? మెడాచేతులూ లేని రవికేమిటి? కచ్చలేకుండా కుచ్చెళ్ల చీరేమిటి? ఆసున్నితం ఆ సుకుమారం యివన్నీ యేమిటి? సంసారి కింత వేషమెందుకురా నాయనా? మానాడు మేమిలాగే ఉన్నామా? నగుకూ స్రాపాఉంటే పెట్టుకునే వాళ్లం లేకపాతేలేదు. గంధంపూసినట్టు రవికా కచ్చదోపుకొని చీరావద్దటరా నాయనా? అదేమో మాకిలాటివేషాలమీదికి మనసే పోయేదికాదు. ఇంటిపనులునాలుగూ చేసుకుంటూ యజమానికీ పిల్లలకీ సంరక్షు చేసుకునేసరికి పొద్దేచాలేది కాదు.........అన్నట్టు! సుందరం — కమల యేమిటిరా నీ మీదలాచెపుతుంది? ఆడుదాని యౌవనం అలా నిత్యం కలకలలాడుతూఉండాలన్నావట! అలాగ ఉండడాని కేమో మందు

లిస్తున్నావట! ఆడుది పిల్లలను కంటే సొగసు చెడిపోతుందన్నావట. యౌవనం జారిపోతుందన్నావట. పిల్లలుపుట్టకుండా యేదో యంత్రం తెప్పించి దాని కిచ్చేవట! ఏమిట్రా బాబూ! ఇదంతా నిజమేనా?" అని తల్లి గట్టిగా అడిగే సరికి సుందర్రావు తలవంచుకొని నిలబడ్డాడు. "అవున్రా నాయనా! ఇవా మీచదువులూ సంపన్నాలూనూ? బాగుంది. మీాయిద్దరూ కలిసి భ్రూణహత్యలు చేస్తున్నారట్రా? ఆడుదాని యౌవనమంటే యేమిటనుకున్నావు? పిల్లలూ కాలక్షేపం సంసారం కట్టుబాట్లూ యివన్నీ వుంటేనే ఆడుదాని విలాసాలు భరించలేరూ! అందులోనూ యేకాలక్షేపం లేకుండా స్వశరీరాన్ని నిత్యం అలా సింగారించుకుంటూ మొగాన్నఅద్దం వ్రేలగట్టుకున్న ఆడుదాని నెవరుభరిస్తారురా బాబూ! పిల్లలవ్యావృత్తి ఉంటే ఆడుదింత పెచ్చురేగిపోగలదా? అదికాక బాబూ! పిల్ల లక్కర లేకపోతే సంసారం యెందుకూ! మీాయిద్దరూ ముసలాళ్లయితే మిమ్మల నెవరు కనిపెడతారు! నేనిలా ఉండిపోతానా? ముసలికాలంలో కూడా యౌవనం ఉంటుందని యెవడేనా వ్రాసేడా యేమిటి? "కాలం నాటి పిల్లలూ కాలంనాటి డబ్బూ" అన్నారు. ఇవి లేకపోతే మిమ్మల నెవరు చూస్తారు? ఎంత మాటన్నావు! బాబూ! పిల్లలు నీయౌవనాని కడ్డుతగుల్తారా? పిల్లలలాటి ప్రేమింపదగిన వస్తువున్నదా? అది అలాఉండగా-పోనీ యౌవనం అలా నిలబడుతుందనుకో, అనుభవించీ మగవాడేడీ? నీవేం మన్మథుడవా? నలకూబరుడవా? వసంతుడవా? చంద్రుడవా? ఏపూట కచేరికి వెళ్లకపోతే ఆపూటే తిండిలేదు గదా? నీలాటివాడా కమలం విలాసాలు కన్నెత్తి చూడగలడూ? అయినా, యిరవైనాలుగు గంటలూ తనముస్తాబూ, తన యౌవనం, తన విలాసం, ఇవ్వన్నీ తలచుకుంటూ కాలక్షేపం చేస్తూన్న ఆడుది గవ్వకేనా పనికివస్తుందా?"

సుందర్రావు:—"అది కాదమ్మా, నా తక్కువ జీతంలో నాయింటినిండా పిల్లలుంటే నేనెలా భరించగలనో చెప్పు! పిల్లలు లేకపోతే మాజీతంతో మేము సుఖంగా కాలక్షేపం చెయ్యవచ్చును. అందుకోసం పిల్లలను కనక్కర లేదన్నాను."

తల్లి:—"అలాగట్రా? నీజీతం యిప్పుడు నీకు సరిపోతూందా? సరిపోతుంది కాబోలు! లేకపోతే యీాబుటాలచీరలూ ఆమజిలీను రవికెలూ, ఆ అత్తరవులూ, ఆవాసన నూనెలూ ఆసబ్బుబిళ్లలూ, గడియారపు గొలుసులూ గజ్జెలవడ్డాణాలూ అవిగాక ఆమందులూ యంత్రాలూ ఇవన్నీ యెలావస్తున్నాయి?"

సుందరరావు—"ఏంచెయమన్నావమ్మా! వీటన్నిటికీ మాభోజనానికీ నాజీతం సరిపోతుందా? చాలదు! అలాగే అప్పుచేసి నెల వాయిదాలచొప్పున తీరుస్తున్నాను. క్రొత్తవస్తువులకు మళ్లా క్రొత్త అప్పులు చేస్తున్నాను. ఇంత తంటాలు పడ్డా దానికి సంతుష్టిలేకుండా ఉంది. ఎప్పుడూ చిడిముడిపడుతూనేఉంటుంది. ఎలాగు దీనితో దేవులాడడం?"

తల్లి—"అదేమో నాయనా! నాకేం తెలుస్తుంది. మీాచదువులూ మీాశాస్త్రిలూను? మీా వింతవింతవ్యూహాలూ విపరీతాలూ నాలాటి ముసలిముండాకూతురు కేం తెలుస్తాయి? నేనేమేనా అన్నట్టయినా యీాముసలిముండ మా యౌవనసౌభాగ్యం చల్లార్చేసిందని నామీాద నేడుస్తారు మీాయిద్దరూనూ!"

సుందర—"అమ్మా! నువ్విప్పుడిలామమ్ము లను వదిలేస్తే యెలాగు? దాని నేదో లాలించి సంసార మార్గంలో పెడతావనే నీ కుత్తరం వ్రాసి రమ్మన్నాను. నువ్వువచ్చి అలాగే అంటే నాకింకెవరు దిక్కు?"

తల్లి—"అలా గయితే కమలాన్ని నా పూచీకి ఒప్పచెపతావా? ఆరు నెలలలో చూడు దాని నెలా మార్చేస్తానో! ఊహ ఉపాయం ఉం డాలి. తెలివితేటలూ ధీశక్తీ ఉండాలి. రోగం పోవడానికి మందుగాని ఆరోగ్యం కదలకుండా నిలపెట్టడానికి మందుందా? శిశుకోశాన్ని యంత్రసాధనంవల్ల లాంగతీశావు గాని స్త్రీ హృదయం లొంగతీయడాని కేయంత్రం కని పెట్టేవు నాయనా! మానసికావస్థలయిన సుఖ దుఃఖాలను యంత్రసాధనం వల్ల తారుమారు చెయ్యగలవా? పువ్వువాడిపోకుండా ద్రావకా లలో కప్పెట్టేవనుకో. ఆ ద్రావకంలో నుండి పువ్వుపైకితీస్తే యేమవుతుంది? అలా దాచిన పువ్వు అలంకారానికేనా, అనుభవానికి వస్తుం దా? గమగమవాసనలు చిమ్ముతుందా? కలకల విరబారుతుందా?"

సుందర:—ఏమిటో అమ్మా అవన్నీ నే నాలోచించలేదు. అయిందేదో అయింది. నీ వేదో సర్దుబాటు చేద్దూ.

తల్లి "ఆలాగే"

౪

ఏడు నెలలయింది. చేతులనిండా గాజులూ, చెక్కులనిండా తెలితళ్కులూ, పలుచపడ్డ శరీరం, బలపడ్డనడుం, ఉల్లిమళ్లవల్లెమల్లి రేకుల కవికా, ప్రేమపూరితములయిన చూపులూ పెద్దరికం తెలిపేనడకా, వీటన్నిటితో కమలం క్రొత్తదయింది. ఆమె కిప్పుడు సుందర్రావు మీద ప్రేమహెచ్చయింది. ఇప్పే డద్దంలో వాని ముంగురులే దిద్దుతుంది. కమీజుకు బొత్తాయిలు పెడుతుంది. కాఫీ తానే చల్లార బోసి వాని కందిస్తుంది. అద్దంలోనూ పయినీ కూడా సుందర్రావునే చూస్తుంది. ఇప్పుడు సుందర్రావానందతరంగాల నందుకొంటున్నా డు. నెలలునిండి కమలానికి కొడుకుపుట్టేడు.

* * *

ఆవేళ సాయంతనం కచేరినుండి సుంద ర్రావు ఇంటికి వచ్చేడు. పాగా అందుకోడానికి కమలం యెదురుగా వచ్చింది. కమలం బాలెం తవేషం కన్నులపండువు చేస్తూంది. గదిలో మంచంమీద కూర్చుని సుందర్రావు ముద్దాప లేక 'యిలారా కమలం'! అన్నాడు. కమలం వచ్చింది మంచంమీద కూర్చోపెట్టుకుని చెదరి న కాటుక రేకలూ, చెక్కులపసుపూ, అసమాన ప్రేమపూరితములయిన కనులూ, పెదవుల తాంబూలపు టెఱుపూ బిగించిన నడుము చు ట్టూ, విడిన రవికకట్టూ, ఇవన్నీ చూచి కమలం భుజంమీద చేయివేసి బుగ్గముద్దు పెట్టుకో పోయేడు. "ఇప్పుడు నన్ను ముద్దేమిటండీ! ఉండండి; బాబును తీసుకొస్తా" అని కొడుకు నెత్తుకొచ్చింది. ఆ మంచంమీద ఆపిల్లవాడిని పడుకోపెట్టి "చూడండీ! బాబెలా నవ్వుతు న్నాడో" అని వంగి కమల మొకబుగ్గా సుంద ర్రావొకబుగ్గా ముద్దుబెట్టుకున్నారు. కమల మొగమెత్తి సుందర్రావు మొగం సంతుష్టితో చూచి "ఇదే ప్రేమసూత్రం" అంది.